



పాత కలెక్టరేట్‌లోని రెవెన్యూ రికార్డుల భవనం

చిత్తూరులోని పాత కలెక్టరేట్‌లో ఉన్న రికార్డులకు భద్రత ఉందా? మదనపల్లె సబ్‌కలెక్టరు కార్యాలయంలో రికార్డుల కాల్చివేత నేపథ్యంలో జిల్లావాసులను వేధిస్తున్న ప్రశ్న ఇది. ఇక్కడి రికార్డుల గదిని చూస్తే భద్రత లేదనే తెలుస్తుంది. కొత్త కలెక్టరేట్‌కు వెళ్లాక.. ఇక్కడ రక్షణ చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారన్న విమర్శలున్నాయి.

\- చిత్తూరు కలెక్టరేట్

ఇక్కడి రికార్డులకు భద్రత ఉందా?

- పాత కలెక్టరేట్‌లోని రికార్డు రూములో పురాతన డాక్యుమెంట్లు
- రక్షణ చర్యలను పట్టించుకోని అధికారులు
- మదనపల్లె ఘటనతోనైనా స్పందిస్తారా?

విరిగిన కిటికీలు



చిత్తూరు పాత కలెక్టరేట్‌లోని రికార్డుల గది 1907లో నిర్మితమైంది. 117 ఏళ్ల చరిత్ర కలిగి ఈ భవనంలోని రికార్డుల గదిలో అతి పురాతనమైన డాక్యుమెంట్లు ఉన్నాయి. ఈ గదిలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రం ఉత్తర ఆర్కాడు జిల్లాతో పాటు వందేళ్ల చిత్తూరు జిల్లాకు సంబంధించి అత్యంత విలువైన పాత రికార్డులు ఉంచారు. ఉదాహరణకు.. అప్పటి తీర్మాన కాపీలు, ప్రభుత్వ గెజిట్ కాపీలు, విలువైన రికార్డులు, బౌండ్ పుస్తకాలు తదితరాలు ఉన్నాయి. 2009లో రెడ్డిగుంటలో నిర్మించిన కొత్త కలెక్టరేట్‌కు మారడంతో ఇక్కడ రికార్డుల భద్రత గురించి పట్టించుకోవడం మానేశారు. మరోవైపు రికార్డు గది భవన గోడలపై పెద్ద చెట్లు కూలిపోతున్నా తొలగించలేదు. పాత రికార్డు రూమ్ పక్కన ప్రహరీకి ఉన్న కంతను పూడ్చే పనులు చేపట్టలేదు. గదులపై ఉన్న అద్దాలు, కిటికీ చెక్కలు విరిగి ఉన్నాయి. ఇక్కడి మెయిన్ గేటుకు తాళాలు వేయకపోవడంతో మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు యథేచ్ఛగా వచ్చి వెళుతున్నారు. ఈ క్రమంలో ఎవరైనా ఆకతాయిలు రికార్డుల గదిలోకి వెళితే.. ఏదైనా తప్పుడు చర్యలకు పాల్పడితే లోపలున్న పురాతన రికార్డుల మాటేమిటి? మదనపల్లె ఘటన తర్వాత అందరికీ ఆందోళన కలిగించే అంశమిది. కాగా, జిల్లాల పునర్విభజన తర్వాత అన్నమయ్య జిల్లాలో కలిసిన మదనపల్లె ప్రాంత ముఖ్యరికార్డులను అక్కడి కలెక్టరేట్‌కు తరలించారు. తిరుపతి జిల్లాకు సంబంధించి రికార్డులను భద్రపరిచేందుకు గదులు లేవంటూ అక్కడి అధికారులు చెప్పడంతో.. ఇప్పటికీ ఆ రికార్డులు ఇక్కడే ఉన్నాయి.

బందెలదొడ్డిలా ట్రెజరీ రికార్డుల గది



బందెలదొడ్డిగా మారిన ట్రెజరీ రికార్డుల గది



చెదలు పట్టిన డే బుక్ పుస్తకాలు, రశీదులు

గదిలో చిందరవందరగా పడున్న కాగితాలు. లోపల పశువులు. ఇలా బందెలదొడ్డిలా కనిపించే ఈ గది.. ట్రెజరీ రికార్డుల గది. ఏళ్ల తరబడి విలువైన రశీదులు, కాగితాలను కొత్త కలెక్టరేట్‌కు తరలించడంలో ట్రెజరీ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. 16 సంవత్సరాలుగా రికార్డు గది నిర్వహణను పట్టించుకోకపోవడంతో బందెల దొడ్డిగా మారింది. ఎన్నో విలువైన రికార్డులున్న ఈ కార్యాలయ గోడలకు ఉన్న కిటికీలను కొందరు ఎత్తుకెళ్లారు.

పుంగనూరులో గోడ కట్టారు



పుంగనూరులోని పాత తహసీల్దారు కార్యాలయంలోని రెవెన్యూ రికార్డుల గది భద్రతకు అధికారులు చర్యలు చేపట్టారు. మదనపల్లె ఘటన నేపథ్యంలో ఇక్కడి రికార్డుల భద్రతపై అనుమానాలు వ్యక్తంచేస్తూ 'పుంగనూరులో భద్రమేనా..?' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పందించి చర్యలకు శ్రీకారం చుట్టారు. రికార్డు గది వద్ద మంగళవారమే పోలీస్‌గార్డు ఏర్పాటు చేశారు. ఇక, రికార్డు గదికి రోడ్డు వైపున ఉన్న రెండు కిటికీలు, వెనుక ఎస్‌ఈబీ కార్యాలయం ఎదురుగా ఉన్న తలుపును తొలగించి బుధవారం గోడ నిర్మించారు. అలాగే సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దారు శివయ్య తెలిపారు.

\- పుంగనూరు



పుంగనూరు రెవెన్యూ రికార్డు గది భద్రతపై కిటికీలు, వెనుక తలుపు తొలగించి నిర్మించిన గోడ

ఐదేళ్ల భూబాగోతం సిద్ధం

- నిషేధిత, ఫ్రీ హోల్డ్, ఇనామ్, ఎస్టేట్ భూముల వివరాల సేకరణ
- నేడు మదనపల్లెలో ఉమ్మడి జిల్లా అధికారుల సమావేశం

చిత్తూరు, ఆంధ్రజ్యోతి/ చిత్తూరు కలెక్టరేట్, జూలై 24: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి నిప్పు ప్రభావం మన జిల్లా మీదా పడింది. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాలు ఉన్న విషయం తెలిసిందే. దీంతో మదనపల్లె ఘటనలో విచారణ బాధ్యతను చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కూ కొంత మేర అప్పగించారు.ఇక ఉమ్మడి జిల్లాల్లో భూముల వివరాలపై రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా గురువారం మదనపల్లెలో ఉమ్మడి జిల్లా పరిధిలోని తహసీల్దారు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు, ఆర్డీవోలతో సిసోడియా సమావేశం ఏర్పాటు చేశారు. దీనికోసం వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన భూబాగోతాలను కలెక్టర్ ఆధ్వర్యంలో వివరాలు సేకరించారు. వీటిని ప్రభుత్వం పంపిన ప్రొఫార్మాలో నింపి బుధవారం జేసీ శ్రీనివాసులుకు అందించారు. మండలాలవారీగా ఐదేళ్లలో 22(ఏ) నిషేధిత జాబితా నుంచి ఎంత భూమిని తొలగించారు.. ఎంత మేర డీకేటీ భూమిని ఫ్రీ హోల్డ్ కిందికి మార్చారు.. అలాగే ఈనామ్, ఎస్టేట్, సెటిల్‌మెంట్, ఎండోమెంట్ ల్యాండ్స్ విషయంలో ఏం జరిగింది.. ఎంత మేర ల్యాండ్ కన్వర్షన్ చేశారు.. వంటి సమగ్ర వివరాలను మంగళ, బుధవారాలు తయారు చేశారు. ఈ వివరాలతో గురువారం నాటి సమావేశానికి హాజరుకానున్నారు.

● అలాగే, గత ఐదేళ్లలో అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పైనా ఈ సమావేశంలో సిసోడియా సమీక్షించనున్నారు. దీనికోసం గ్రామాలవారీగా రిజిస్ట్రేషన్ల వివరాలను ఈ రెండు రోజులపాటు జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు సేకరించారు. మదనపల్లెలో జరిగే ఈ సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు 13మంది సబ్‌రిజిస్ట్రార్లు పాల్గొననున్నారు.

గాడి తప్పిన విద్యాశాఖ

- జగన్ మేనమామ అండతో డీఈవో రుబాబు
- ఎమ్మెల్యేలను లెక్కచేయని తెంపరితనం

అన్ని శాఖలకు ఆదర్శంగా ఉండాల్సిన విద్యాశాఖ జిల్లాలో గాడి తప్పింది. డీఈవోగా దేవరాజు బాధ్యతలు చేపట్టాక ఈ శాఖలో బాధ్యతారాహిత్యం, అవకతవకలు రాజ్యమేలుతున్నాయన్న విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయి పర్యటనల్లో తమ దృష్టికొచ్చిన విద్యారంగ సమస్యల్ని పరిష్కరించాలని ప్రస్తుత ఎమ్మెల్యేలు కోరినా ధిక్కార ధోరణి ప్రదర్శిస్తున్నారు. విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొనడం లేదు. జగన్ మేనమామ, కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, జగన్ భక్త ఉద్యోగ సంఘ నేత వెంకట్రామిరెడ్డి అండతో ఈ పోస్టులోకి వచ్చిన డీఈవో.. ఇప్పటికీ పాత వాసనల్ని వదలడం లేదు.

\- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

చిత్తూరు డీఈవో దేవరాజు కడప జిల్లా వాసి. విద్యాశాఖలో క్లర్కు స్థాయి నుంచి ఏడీ స్థాయి వరకు కడప జిల్లాలో పని చేశారు. డీఈవోగా పదోన్నతి పొంది జగన్ మేనమామ రవీంద్రనాథరెడ్డి అండతో ఎన్నికల ముందు చిత్తూరుకు పోస్టింగ్ తెచ్చుకున్నారు. తన కుమారుడు కడప జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ నాయకుడిగా ఉండడం.. విద్యాశాఖలో అధికారిగా పనిచేస్తున్న తన సోదరుడు విజయేంద్రరావు (చిత్తూరు పూర్వ డీఈవో) వెంకట్రామిరెడ్డి సంఘంలో నాయకుడిగా పనిచేసి ఉండడం.. వంటి నేపథ్యాలనూ వాడుకుని చిత్తూరు డీఈవోగా వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. పోస్టల్ బ్యాలెట్ విషయంలో విద్యాశాఖ ఉద్యోగులను గందరగోళానికి గురి చేసేలా వ్యవహరించారన్న ఆరోపణలూ ఆయనపై ఉన్నాయి. ఎన్నికలకు ముందు వెంకట్రామిరెడ్డి అనుకూల ఉపాధ్యాయ సంఘాల నాయకులు చిత్తూరులోని కల్యాణ మండపాల్లో పెద్దఎత్తున రాజకీయ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచార సమావేశాలు, నగదు పంపిణీ నిర్వహించినా డీఈవో చూసీచూడనట్లు ఉండిపోయారు.



మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా అనధికార కార్యక్రమంలో వైసీపీ నేత విజయానందరెడ్డితో కలిసి పాల్గొన్న డీఈవో దేవరాజు

అప్పుడలా.. ఇప్పుడిలా


వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులే కాదు నాయకులూ అడిగితే క్షణాల్లో పనులు చేసి పెట్టిన డీఈవో దేవరాజు.. ఇప్పుడు కూటమి ఎమ్మెల్యేలకు ఏ మాత్రం స్పందించడం లేదు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీలో ప్రజాప్రతినిధులంతా అధికారులతో కలిసి పాల్గొనాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీంతో జిల్లాలోని ప్రజాప్రతినిధులు కిట్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. డీఈవో దేవరాజు మాత్రం ఎక్కడా ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొనడానికి ఇష్టపడడం లేదని విద్యాశాఖలో ప్రచారం జరుగుతోంది. ఈ నెల 19న చిత్తూరులోని మూడు పాఠశాలల్లో విద్యాసామగ్రిని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అందించారు. ఏ ఒక్క చోటికీ డీఈవో రాలేదు. ఈ నెల 8వ తేదీన తవణంపల్లెలో జరిగిన కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నా.. డీఈవో లేరు. ఇటీవల తన నియోజకవర్గంలోని ఒక మహిళా ఉద్యోగి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే సిఫార్సు చేయగా.. డీఈవో ఖాతరు చేయలేదు. పైగా ఉద్యోగులు, సంఘ ప్రతినిధులు ఎమ్మెల్యేను ఎలా కలుస్తారని చిందులేసినట్లు తెలుస్తోంది. అదే ఎన్నికల సమయంలో అప్పటి చిత్తూరు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డితో కలిసి పలు అనధికార కార్యక్రమాల్లో ఈయన పాల్గొనడం గమనార్హం.

రెగ్యులరైజేషన్ జాబితాల తయారీలో నిర్లక్ష్యం

పదోన్నతులు, బదిలీలకు సీనియారిటీనే ప్రాతిపాదిక. ఈ ప్రక్రియలో టీచర్ల సర్వీసు రెగ్యులరైజేషన్ జాబితాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. వీటిని పారదర్శకంగా తయారు చేసి అందరికీ అందుబాటులో ఉంచాలని డీఈవోకు ఎన్నిసార్లు విన్నవించినా కనీస స్పందన లేదని ఉపాధ్యాయ సంఘాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. 1996 నుంచీ ఇప్పటివరకు నియమితులైన టీచర్లకు రెగ్యులరైజేషన్ తుది జాబితాలు విడుదల కాలేదు. దీంతో సర్వీసు రిజిస్టర్లలో కూడా సరైన నమోదులు లేక గందరగోళం నెలకొంది. బోధనేతర సిబ్బంది సీనియారిటీ జాబితాల తయారీ కూడా పారదర్శకంగా చేయలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. డిప్యుటేషన్ల పేరుతో అవకతవకలకు పాల్పడినట్లు విమర్శలున్నాయి.

రివర్షన్ ఆర్డర్లకూ ఎదురుచూపులే

పదోన్నతి పొందిన టీచర్లు ఆర్థికంగా తమకు నష్టమైనప్పటికీ.. ఆరోగ్య, వ్యక్తిగత సమస్యల కారణంగా ఎంతోమంది రివర్షన్ కోసం దరఖాస్తు చేశారు. వీరిలో పది మందికిపైగా టీచర్లు ఏడాదిగా డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఎన్నికల సమయంలో వైసీపీ ఎమ్మెల్యేల సిఫార్సులు, డబ్బు ప్రభావం కారణంగా కొద్దిమందికి మాత్రమే రివర్షన్ ఆర్డర్లు ఆగమేఘాలపైన ఇచ్చారన్న విమర్శలున్నాయి. వారంతా తమ పాత పోస్టుల్లో చేరిపోయారు. అవేవీ చేయలేని వాళ్లేమో డీఈవో చుట్టూ తిరుగుతున్నారు. కొద్ది రోజుల కిందట తన భార్య రివర్షన్ ఆర్డర్ విషయంలో తీవ్ర జాప్యాన్ని ప్రశ్నించిన రిటైర్డ్ టీచర్‌ను డీఈవో దబాయించి ఛాంబర్ నుంచి బయటికెళ్లమని గద్దించారు. ఆ రిటైర్డ్ టీచర్ సహనం నశించి డీఈవోపైన తిరగబడ్డారు.



కుప్పం మున్సిపాలిటీకి రూ.250 కోట్లు

- ఇది చంద్రబాబు మాట
- టీడీపీ శ్రేణుల సమావేశంలో నారా భువనేశ్వరి

కుప్పం, జూలై 24: 'కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం చంద్రబాబు రూ.250 కోట్ల గ్రాంటు ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని నన్ను చెప్పమన్నారు. ఈ నిధులతో పట్టణం సమగ్రాభివృద్ధి చెందుతుంది' అని నారా భువనేశ్వరి అన్నారు. కుప్పంలోని పీఈఎస్ ఆడిటోరియంలో బుధవారం ఉదయం టీడీపీ మున్సిపల్ నాయకులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లతో ఆమె సమావేశమయ్యారు. కార్యకర్తల కష్టాన్ని చంద్రబాబు కానీ, తాను, లోకేశ్ కానీ ఏనాడూ మరచిపోలేదన్నారు. వైసీపీ అయిదేళ్ల పాలనలో కార్యకర్తలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, పార్టీకోసం తమ జీవితాలను త్యాగం చేశారని చెప్పారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. మున్సిపాలిటీలో 12 వేల మెజారిటీ రావడం ఆనందంగా ఉందన్నారు. మున్సిపాలిటీలో బూత్‌ల వారీగా వచ్చిన మెజారిటీని పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ వివరించారు. ఒక వార్డునైనా దత్తత తీసుకోకపోవడం మనసుకు కష్టం కలిగిస్తోందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సృష్టించిన అరాచకాలకు, అన్యాయాలకు కార్యకర్తలు భయపడిపోయారని క్లస్టర్ ఇన్‌చార్జి వీజీ ప్రతాప్ గుర్తుచేశారు. వారి బెదిరింపులకు ఒకానొక సమయంలో నిరాశకు గురైన విషయం వాస్తవమేనన్నారు. అయితే ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఇచ్చిన ధైర్యంతో తేరుకుని, బూత్‌లవద్ద ధైర్యంగా నిలబడి చంద్రబాబుకు విజయం సాధించిపెట్టామని చెప్పారు. ఈసారి మున్సిపాలిటీలో 12 వేలు మెజారిటీ తెచ్చినా బీ గ్రేడ్ ఇవ్వడం, ఇతర మండలాలకు ఏ గ్రేడు ఇవ్వడం బాధించిందని మరో క్లస్టర్ ఇన్‌చార్జి సత్యేంద్ర శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు.



కార్యకర్తల మాటలు ఆలకిస్తున్న భువనేశ్వరి

మనసుకు కష్టంగా ఉంది

'పార్టీకి ముందునుంచి కష్టపడ్డాం. మున్సిపల్ ఎన్నికల్లో దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు ఎదుర్కొన్నాం. ఎమ్మెల్యే ఎన్నికల్లో రాక్షసులతో పోరాడాం. వైసీపీ దాడులకు వెరవకుండా పోలింగ్ కేంద్రాలు కాపాడుకున్నాం. అయితే పోరాడిన వాళ్లకు తగిన గుర్తింపు లేకుండా మాపై దాడులు చేసి, ఇబ్బందులు సృష్టించిన వారిని పార్టీలో చేర్చుకోవడానికి అధిష్ఠానం నిర్ణయించినట్లు తెలిసింది. ఇలా చేయడం మా మనసుకు కష్టంగా ఉంది' అని మాజీ ఎంపీటీసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. మీ కష్టం చూసిన వ్యక్తిగా మీకేం చేయాలో చంద్రబాబుతో చెప్పి అది చేస్తానని కార్యకర్తలకు భువనేశ్వరి హామీ ఇచ్చారు. పార్టీపరంగా, కుటుంబాల పరంగా అభివృద్ధి చెందడానికి తామంతా సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. అంతేకానీ అధిష్ఠానం గురించి, చేరికల గురించీ వేరేలా అనుకోరాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నాయకులు పీఎస్.మునిరత్నం, డాక్టర్ సురేశ్‌బాబు, గాజుల ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గెలుపు ఫలాలు ప్రజలకు అందాలి

గెలిచాం అనేది ఒక అంశమైతే ఆ గెలుపు ఫలాలను ప్రజలకు అందించడం అనేది అతిముఖ్యమని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. కుప్పం మండల గ్రామ పర్యటన ముగించుకున్న ఆమె బుధవారం రాత్రి పీఈఎస్ అతిథి గృహంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీతో సమావేశమయ్యారు. గెలిచామని విర్రవీగితే, తిరిగి కింద పడిపోతామన్న స్పృహ నాయకుల్లో ఉండాలన్నారు. ఈ గెలుపు కార్యకర్తలు, ప్రజలు ఇచ్చారని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అలాంటి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమన్వయ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సమస్యలను భువనేశ్వరికి చెబితే పరిష్కారం లభిస్తుందన్న నమ్మకం పార్టీ శ్రేణులతోపాటు ప్రజలకు కలిగిందన్నారు. అనుకున్నంత మెజారిటీ రాకపోవడం కొంత నిరాశకు గురిచేసినా, రాక్షసులతో యుద్ధం చేసి గెలిచామన్న సంతృప్తి లభించిందన్నారు.



చెల్దిగానిపల్లెలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్



రైతులు, నేతలతో చర్చిస్తున్న కలెక్టరు సుమిత్‌కుమార్

రామకుప్పం, జూలై 24: రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెలో రూ.8.42 కోట్లతో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టరు సుమిత్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన కడా పీడీ వికాస్‌మర్మత్‌తో కలిసి యూనిట్ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. స్థానిక రైతుసహకార సంఘం సభ్యులు, టీడీపీ నేతలతో చర్చించారు. ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు రైతు సహకార సంఘానికి వంద శాతం ఆర్థికసాయం ప్రభుత్వం అందిస్తుందన్నారు. సంఘం అధ్యక్షుడు, డైరెక్టర్లు నిబద్ధతతో యూనిట్ నిర్వహిస్తూ రైతులందరికీ మేలు జరిగేలా చూడాలని సూచించారు. సంఘ సభ్యులే సివిల్ వర్కర్లతో యూనిట్‌ను నిర్మించుకుంటే న్యాణ్యతతో పాటు త్వరితగతిన నిర్మాణం పూర్తవుతుందన్నారు. నాణ్యతను పర్యవేక్షించేందుకు కడ నుంచి ఇంజనీర్లను, ఇతర శాఖల నుంచి ఇద్దరు సభ్యులను పర్యవేక్షకులుగా నియమిస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ జిల్లా అధికారి మధుసూధన్‌రెడ్డి, ఏడీ కోటేశ్వరరావు, టీడీపీ నేతలు మునస్వామి, పట్రనారాణాచారి, ఆనందరెడ్డి, చలపతి, చిన్నికృష్ణ, సీతాపతి, రామ్మూర్తి, విశ్వనాథ్, వెంకటరమణ, సత్తి, సురేష్, రెడ్డిపురుషోత్తం, ఉమాపతి, చిన్నసురేష్, వెంకటాచలం, రైతు సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అమృత్ భారత్‌కు పది రైల్వే స్టేషన్ల ఎంపిక

తిరుపతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఏకంగా పది రైల్వే స్టేషన్లకు తీపి కబురు ప్రకటించింది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఈ రెండు జిల్లాల పరిధిలో మొత్తం పది రైల్వే స్టేషన్లను ఎంపిక చేసింది. తిరుపతి, రేణిగుంట, పాకాల , చిత్తూరు, శ్రీకాళహస్తి, మదనపల్లె రోడ్డు, పీలేరు, కుప్పం,గూడూరు, సూళ్ళూరుపేట స్టేషన్లు అవకాశం దక్కించుకున్నాయి. కాగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 73 రైల్వే స్టేషన్లను కేంద్రం ఎంపిక చేయగా అందులో ఈ ప్రాంతానివే పది స్టేషన్లు వుండడం గమనార్హం. అమృత్ భారత్ పథకం కింద ఇప్పుడున్న రైల్వే స్టేషన్లను పూర్తి స్థాయిలో తిరిగి అభివృద్ధి పరచనున్నారు. అత్యాధునిక సాంకేతిక సదుపాయాలు, హంగులతో వీటిని తీర్చిదిద్దే అవకాశముంది. అయితే స్టేషన్ల వారీ అభివృద్ధికి కేటాయించిన నిధుల వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. కొన్నేళ్ళ కిందటే ఈ ప్రాంతంలోని రైల్వే స్టేషన్లను ఆధునికీకరించిన సంగతి తెలిసిందే. తాజాగా కేంద్రం అమృత్ పథకం కిందకు వీటిని చేర్చడంతో ఆధునికీకరణ, అభివృద్ధి పరంగా ఈ స్టేషన్లు మరో అడుగు ముందుకు వేయనున్నాయి. ఎంపికైన స్టేషన్లను పరిశీలిస్తే తిరుపతి, శ్రీకాళహస్తి స్టేషన్లు పుణ్యక్షేత్రాల కేటగిరీలో వుండగా గూడూరు, రేణిగుంట, పాకాల స్టేషన్లు జంక్షన్ కేంద్రాలుగా వున్నాయి. సూళ్ళూరుపేట తమిళనాడు సరిహద్దుల్లోనూ, కుప్పం కర్ణాటక సరిహద్దుల్లోనూ కీలక స్టేషన్లు. చిత్తూరు జిల్లా కేంద్రంతో పాటు తమిళనాడు సరిహద్దుల్లో కీలక స్టేషన్ కాగా పీలేరు ఉమ్మడి చిత్తూరు జిల్లా నడిబొడ్డున ముఖ్యమైన స్టేషన్‌గా ఆవిర్భవించిన సంగతి తెలిసిందే. వీటి ప్రాధాన్యతను బట్టే అమృత్ పథకం పరిధిలోకి వీటిని కేంద్ర ప్రభుత్వం చేర్చినట్టు భావించాల్సి వస్తోంది. ఈ స్టేషన్ల దశ సమీప భవిష్యత్తులో సమూలంగా మారనుంది.

వైభవంగా సంకటహర గణపతి వ్రతం

● స్వర్ణరథంపై ఊరేగిన వరసిద్ధుడు

ఐరాల(కాణిపాకం), జూలై 24: కాణిపాకంలో బుధవారం సంకటహర గణపతి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేసి, సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను ఆలయ ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. ఆస్థాన మండపంలోని వేదికపై కొలువుదీర్చి విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాల ఎదుట భక్తులను కూర్చోబెట్టి వారి ఆధ్వర్యంలో సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించారు. రాత్రి ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి ఆలయ మాడ వీధులలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. వందలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవి, విఘ్నేష్ పాల్గొన్నారు.



స్వర్ణరథంపై స్వామివారి ఊరేగింపు



ఆస్థాన మండపంలో సంకటహర గణపతివ్రతం నిర్వహిస్తున్న భక్తులు

వేలంద్వారా రూ.1.33 కోట్ల ఆదాయం

ఐరాల(కాణిపాకం), జూలై 24: కాణిపాక వినాయక స్వామి ఆలయానికి బుధవారం నిర్వహించిన వేలం ద్వారా రూ.1,33,83,499 ఆదాయం లభించినట్లు ఈవో వెంకటేశు తెలిపారు. ఈవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేలంలో తలనీలాలు పోగు చేసుకునే హక్కును రూ.60లక్షలకు, వాహనాలను శుభ్రపరిచే హక్కును రూ.20,09,500కు, బస్టాండ్ వద్ద క్యాంటీన్ నిర్వహణ హక్కును రూ.49,90,999కు హెచ్చుపాటదారులు కైవసం చేసుకున్నారు. ఆలయానికి సంబంధించిన పాత బొలెరో వాహనాన్ని రూ2,20,000కు, లైటింగ్ షో వెనుక భాగంలో ఉన్న దుకాణం నెంబరు 1 నిర్వహణను రూ.81వేలకు, దుకాణం నెంబరు 2ను రూ.82వేలకు కైవసం చేసుకున్నారు. వారికి సంవత్సర కాల పరిమితి ఉంటుందని ఈవో తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యంనాయుడు, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, హేమేశ్వరబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెద్దిరెడ్డిపై అనర్హత వేటు వేయండి

● బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

పుంగనూరు, జూలై 24: 'పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన, ఆయన భార్య స్వర్ణలత పేరుతో వివిధ ప్రాంతాల్లో ఉన్న 142 ఆస్తుల వివరాలు పొందుపరచకుండా మోసం చేశారు. దీంతో ఆయనపై అనర్హత వేటు వేయాలి' అంటూ బీసీవైపార్టీ అధినేత బి.రామచంద్రయాదవ్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ ఈ కేసును విచారించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పుంగనూరులో పోటీ చేసిన రామచంద్రయాదవ్ దీనిపై మే 7వ తేదీన ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈనెల నాలుగోతేది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రామచంద్రయాదవ్ తరపున హైకోర్టు సీనియర్ న్యాయవాది ఉమేశ్‌చంద్ర కేసు దాఖలు చేశారు. బుధవారం విచారణకు వచ్చింది. పుంగనూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వై.మధుసూదన్‌రెడ్డిని కోర్టు రిమార్కులు ఇవ్వాలని ఆదేశించగా ఆయన వివరాలు హైకోర్టుకు సమర్పించారు. కాగా, ఆ ఎన్నికల్లో పెద్దిరెడ్డి తర్వాత అత్యధిక ఓట్లు వచ్చిన టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని కూడా ఈ కేసు విచారణలో భాగస్వామి చేస్తూ నోటీసు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. అనంతరం కేసును 30వ తేదికి వాయిదా వేశారు.

న్యాయం గెలవడమే ముఖ్యం

ఈ కేసువల్ల తాను పుంగనూరు ఎమ్మెల్యే కాకపోయినా న్యాయం గెలవడం, అక్రమార్కుడు పెద్దిరెడ్డి ఓటమే ముఖ్యమని బోడే రామచంద్రయాదవ్ అన్నారు. ఎమ్మెల్యేగానే కాదు అసలు రాజకీయాల్లోనే పెద్దిరెడ్డి ఉండకూడదన్నారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డుల దహనంలో పెద్దిరెడ్డి అక్రమ ఆస్తులకు ప్రమేయం ఉందని ఆరోపించారు. పుంగనూరు ప్రజలు ప్రశాంతంగా ఉండాలంటే పెద్దిరెడ్డి రాజకీయాలకు దూరం కావాలని, చేసిన తప్పులకు శిక్ష పడాలని అన్నారు.

విద్యుత్ శాఖ గ్రీవెన్స్‌కు 22 వినతులు

● అప్పటికప్పుడే 9 పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, జూలై 24: ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ, ఈఈ కార్యాలయాల్లో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో 22 వినతులు వచ్చాయని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఇందులో తిరుపతిలో 5, చిత్తూరు ఆపరేషన్‌లో 6, పుంగనూరు 6, మదనపల్లె 5 వచ్చాయని వెల్లడించారు. ప్రతి బుధవారమూ నిర్వహించే ఈ కార్యక్రమాన్ని వినియోగదారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో చిత్తూరు ఆపరేషన్ ఈఈ మునిచంద్ర వినతులు స్వీకరించారు. అక్కడికక్కడే 9 పరిష్కరించామని, మిగిలినవి త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు.

చెంగుబల్ల వీఏఏ సస్పెన్షన్

చిత్తూరు (సెంట్రల్), జూలై 24: శాంతిపురం మండలం చెంగుబల్ల విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎస్.వినయ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలో రైతులకు విక్రయించిన ఎరువులకు సంబంధించి డబ్బు చెల్లింపులో నాలుగు నెలలుగా జాప్యం జరుగుతుండడం, రూ.2.32 లక్షలు రావాల్సి ఉండడంతో జిల్లా వ్యవసాయశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

పంట పొలాలపై ఒంటరి ఏనుగు దాడి

ఐరాల, జూలై 24: ఐరాల మండలం వినాయకపురంలో మంగళవారం అర్ధరాత్రి ఒంటరి ఏనుగు పంట పొలాలపై దాడి చేసింది. కొబ్బరి, అరటి తోటలను నాశనం చేసింది. సాయీశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వినయ్‌రెడ్డికి చెందిన కొబ్బరి, అరటి తోటలతో పాటు కంచె కూసాలను విరిచేసింది. అపోలో గ్రూపు ఛైర్మన్ ప్రతాప్ ఎ.సి.రెడ్డికి చెందిన ఔషధాలకు వినియోగించే ఉసిరి చెట్లను ధ్వంసం చేసింది. రూ.లక్షకు పైగా ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు.



ఏనుగు విరిచేసిన కంచె, కూసాలు

టమోటా తోటలపై ఏనుగుల దాడి



పత్రపల్లె సమీపంలో ఏనుగుల బీభత్సం

సోమల: సోమల మండలం ఇవినెలుకూరివారిపల్లె నుంచి అడుసుపల్లె, జీడిరేవులవంక, వంగసానివారిపల్లె మీదుగా రాంపల్లె బీట్‌కు మంగళవారం రాత్రి ఏనుగులు చేరుకున్నాయి. ఈ క్రమంలో పత్రపల్లె, కొత్తూరుకు చెందిన శివకుమార్‌రాజు, రామకృష్ణమరాజు, జగన్నాథరాజు, చలపతిరాజుకు చెందిన టమోటా, వరి, కొబ్బరి, బొప్పాయి తోటలను ధ్వంసం చేశాయి. వారంరోజులుగా ఒంటరి ఏనుగు రాంపల్లె బీట్‌లోనే హల్‌చల్ చేసింది. మంగళవారం రాత్రి దీనికి మరో గుంపు తోడైంది.

అవిగో ఏనుగులు!

సోషల్ మీడియాలతో ఆకతాయిల చేష్టలతో భయాందోళన

గుడుపల్లె, జూలై 24: గుడుపల్లె మండలంలో బుధవారం ఉదయం ఏనుగులు సంచరిస్తున్నాయన్న వార్తలు కలకలం సృష్టించాయి. కర్ణాటక సరిహద్దుల్లోని కొడతనపల్లె, బిసానత్తం, అత్తినత్తం తదితర గ్రామాల సమీప అటవీ ప్రాంతంలో ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు చూసి ఆందోళన చెందారు. అటవీ శాఖాధికారులు కూడా ఆ ప్రాంతాలకు వెళ్లి గాలించారు. ఎక్కడా ఏనుగుల గుంపు కనిపించలేదు. ఈ పోస్టులన్నీ తప్పుడువని, అందులో వచ్చిన సమాచారం అబద్ధమని మధ్యాహ్నానికి తేలింది. కొడనపల్లెకు చెందిన ఓ ఆకతాయి ఈ ఫేక్ న్యూస్ పోస్టులు పెట్టి ప్రచారం చేశాడని అదే గ్రామానికి చెందిన రైతులు చెప్పారు.

గేట్లు తెరిచి దారివ్వండి

హైకోర్టు ఆదేశం - అయినా లెక్కచేయని పెద్దిరెడ్డి



పెద్దిరెడ్డి ఇంటి సమీపంలో బుధవారం కూడా మూసివున్న గేట్లు

తిరుపతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో మారుతీనగర్, రాయల్‌నగర్ మెయిన్‌రోడ్లను కలుపుతూ నిర్మించిన సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన గేట్లను మూసివేయవద్దని, సామాన్య ప్రజల రాకపోకలకు అవరోధం కల్పించవద్దని మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులను హైకోర్టు ఆదేశించింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ వేసిన రోడ్డుకు పెద్దిరెడ్డి తన ఇంటి ముందు సామాన్య ప్రజలు ఎవరూ రాకపోకలు సాగించకూడదని రెండు వైపులా గేట్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.ఈ గేట్లను ఓపెన్‌చేసి రెండు కాలనీలకు రాకపోకలు కల్పించాలని హైకోర్టు ఆదేశించినా ఇప్పటికీ గేట్లు తెరవకపోవడం విమర్శలకు తావిస్తోంది.దీని పూర్వాపరాలు పరిశీలిస్తే...కార్పొరేషన్ రోడ్డుకు పెద్దిరెడ్డి గేట్లు ఏర్పాటుచేసుకోవడంపై మీడియాలో కథనాలు రావడంతో మూడు వారాల క్రితం పెద్దిరెడ్డి ఇంటిముందు జనసేన నేత కిరణ్ రాయల్ ధర్నాకు దిగిన నేపథ్యంలో వివాదం రోడ్డెక్కింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మున్సిపల్ అధికారులను నివేదిక కోరారు. స్థానిక 18వ డివిజన్లోని మారుతీనగర్-రాయల్ నగర్‌ను కలిపేందుకు సీసీ రోడ్డు వేస్తున్నట్టు రూ9.55లక్షల అంచనాతో (ఐఎఫ్‌బి నెం45/19-20)ఒకటి, రూ9.50 లక్షలతో (ఐఎఫ్‌బి నెం.46/19-20)లతో మరొకటి రెండు విడతలుగా నామినేటెడ్ కింద టెండరిచ్చినట్టు అధికారులు గుర్తించారు.స్థానికుల విజ్ఞప్తి మేరకు రాయల్‌నగర్ నుంచి మారుతీనగర్‌ను కలుపుతూ రోడ్డు వేస్తున్నట్టు కార్పొరేషన్ రికార్డుల్లో నమోదు చేసిన విషయాన్ని కూడా నిర్ధారించారు.అయితే ఈలోపు పెద్దిరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఈనెల 8న హైకోర్టును ఆశ్రయించారు.సంబంధిత స్థలంలో నిర్మించిన సిమెంట్ రోడ్డును, రక్షణ కోసం నిర్మించిన గేటును తొలగించకుండా ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. తమ భద్రతను దృష్టిలో పెట్టుకుని అప్పట్లో కార్పొరేషన్ నిధులతో సీసీ రోడ్డు నిర్మించారని, అందుకైన ఖర్చు కూడా తాము చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని అభ్యర్థించారు. కార్పొరేషన్ తరపున కూడా ఓ నివేదికను కోర్టుకు సమర్పించారు.ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్..పిటీషనర్ల ఆస్తుల విషయంలో ఏవైనా చర్యలు తీసుకోవాలని భావిస్తే చట్టనిబంధనల ప్రకారం నడుచుకోవాలని అధికారులకు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ ఈనెల 10వ తేదీకి కేసును వాయిదా వేశారు.ఇంతవరకు పెద్దిరెడ్డికి అనుకూలమైన తీర్పువచ్చినప్పటికీ 10వ తేదీ ప్రభుత్వ న్యాయవాది రిట్ పిటీషన్ దాఖలు చేశారు.ప్రజా రవాణాకు ఇబ్బంది కలగకుండా,గేట్లు మూసివేయకుండా చూడాలని 8వ తేదీ ఇచ్చిన ఉత్తర్వును సవరిస్తూ హైకోర్టు స్పష్టంగా మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ప్రతివాదులకు కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయడానికి కేసును 4 వారాలకు వాయిదా వేసింది. పిటీషనర్ల ఆస్తికి ఏదైనా ముప్పు ఉన్నట్లైతే, అవసరమైన రక్షణ కోసం సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది.చట్టనిబంధనలను అనుసరించి దరఖాస్తుపై నిర్ణయం తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేసింది. పిటీషనర్ల ప్రైవేటు ఆస్తి వ్యవహారంలో ఎలాంటి తొందరపాటు, బలవంతపు చర్యలు తీసుకోవద్దని కార్పొరేషన్ అధికారులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవరించింది.ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు తదుపరి తీర్పు వచ్చేవరకు పెద్దిరెడ్డి ఇంటి ముందు రెండు కాలనీలకు దారి కల్పించాలని ఈనెల 15న మున్సిపల్ కార్పొరేషన్‌కు ఉత్తర్వులు అందాయి.అయితే ఇప్పటికీ ఆయన గేట్లు తెరిచివుంచకపోవడంతో కార్పొరేషన్ యంత్రాంగం అటువైపు వెళ్లేందుకు కూడా సాహసించకపోవడం విమర్శలకు తావిచ్చింది. బుధవారం బాధ్యతలు తీసుకున్న కొత్త కమిషనర్ అయినా ఆ దిశగా చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి.

ఏటీఎంలో నగదు చోరీ కేసులో ఒకరి అరెస్టు

● మరో నలుగురి కోసం గాలింపు చర్యలు

గుడిపాల, జూలై 24: గుడిపాల ఏటీఎంలో నగదు చోరీ కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు పంపారు. మరో నలుగురికోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలో ఈనెల 7వ తేదిన ఎస్బీఐ ఏటీఎంలో సుమారు రూ.25.98 లక్షలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు మూడు బృందాలుగా హరియాణాలో గాలింపు చర్యలు చేపట్టారు. దొంగతనానికి ఉపయోగించిన కారును, ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా మరో నలుగురి పాత్ర ఉన్నట్లు నిర్ధారించారు. దొంగతనానికి పాల్పడిన ప్పటి నుంచి ఫోన్‌కాల్ ఆధారంతో సాంకేతిక పరిజ్ఞానంతో దుండగులు హరియాణా వాస్తవ్యులుగా గుర్తించారు. ఈ చోరీకి ఐదుగురు వ్యక్తులు పాల్పడినట్లుగా గుర్తించి, వారిలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించి, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరిన్ని విషయాలను రాబట్టే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

అంతరపంటలతో వేరుశనగలో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి

గంగవరం, జూలై 24: వేరుశనగ పంటలో అంతర్ పంటల సాగు ద్వారా చీడపురుగుల బారి నుంచి బయట పడటంతోపాటు అనుకున్న దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం దండపల్లె కురపల్లె సమీపంలో వేరుశనగ పొలంలో అంతర్‌పంట సాగు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. సాగులో సరిహద్దు పంటగా జొన్న లేదా సజ్జ, అంతర్‌పంటలుగా కంది వేయాలని సూచించారు. తద్వారా వేరుశనగకు చీడపురుగుల బెడద తప్పుతుందన్నారు. ఎకరాకు సుమారు 200 బస్తాల జిప్సం వేస్తే అనుకున్న దిగుబడి సాధించవచ్చన్నారు. వరి రైతులు ఈ సీజన్‌లో తూర్పు - పడమరకు లైన్ షోయింగ్ విధానం ద్వారా 20 సెం.మీ. దూరంలో వరినాట్లను విత్తాలన్నారు. దీనివల్ల పంటకు గాలి, వెలుతురు పుష్కలంగా అంది అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శివకుమార్, ఏవో హేమలత, సర్పంచ్ బీరుగౌడుతో పాటు రైతులు పాల్గొన్నారు.

11కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్

విద్యుదాఘాతంతో ఒకరి మృతి ● ఇద్దరి పరిస్థితి విషమం, మరో పది మందికి గాయాలు

కల్లూరు, 24: పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీ గొట్టిగింటివారిపల్లికి వెళ్లే మార్గంలో బుధవారం 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో 12 మందికి తీవ్రగాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఒంగోలు జిల్లాకు చెందిన ఏవీఆర్ కంపెనీ పులిచెర్ల మండలంలో తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులు చేపడుతోంది. ఒడిశా, బిహారు రాష్ట్రాలకు చెందిన కూలీలు పులిచెర్లలో ఉంటూ ఈ పనులు చేస్తున్నారు. బుధవారం ఉదయం కావేటిగారిపల్లి పంచాయతీలో ట్యాంకు నిర్మాణ పరికరాలను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని 13 మంది కూలీలు బయలుదేరారు. భీమవరం రోడ్డు నుంచి గొట్టిగింటివారిపల్లి ఏటవాలుగా ఉండే మార్గంలో వెళుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న 11కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఒక్కసారిగా విద్యుత్ వైర్లు తెగి ట్రాక్టర్‌పై పడ్డాయి. ట్రాలీలో ఉన్న కూలీలు విద్యుదాఘాతానికి గురయ్యారు. ముందు టైర్లు విరిగిపోవడంతో ట్రాక్టర్ రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. ఈ ప్రమాదంలో పలువురికి కాళ్లు, చేతులు విరిగిపోయాయి. విద్యుదాఘాతంలో మరికొందరికి తీవ్రగాయాలయ్యాయి. ఒడిశా రాష్ట్రం మల్కాజ్‌గిరి జిల్లా మహరాజ్‌పలికి చెందిన అనూప్ సర్దార్ (20) అక్కడికక్కడే మృతి చెందారు. బీహార్ రాష్ట్రానికి చెందిన అఖిలేష్‌కుమార్‌కు, ఒడిశాకు చెందిన రాజు పరిస్థితి విషమంగా ఉంది. ఒడిశాకు చెందిన కళ్యాణ్, ఒమ్మతో, శుశాంత్, రాజ్, కురు, రమేష్, మహేందర్, శుభ, భీమ, బీహార్‌కు చెందిన గుండోల్‌కుమార్, సదుం మండలానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రవి గాయపడ్డారు. కొందరికి విద్యుదాఘాతంతో శరీరం కాలగా, మరికొందరికి కాళ్లు, చేతులు విరిగిపోయాయి. స్థానికుల చొరవతో క్షతగాత్రులను ముందుగా ఎల్లంకివారిపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అనూప్ సర్ధార్ మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.







గాయపడిన అఖిలేష్‌కుమార్ - మృతిచెందిన అనూప్‌సర్దార్ - కాలిన గాయాలతో రుయాలో చికిత్స పొందుతున్న రాజు



ప్రమాదానికి గురైన ట్రాక్టర్

పాఠశాలకు రూ.లక్ష విరాళం



దాత దంపతులను సన్మానిస్తున్న హైస్కూల్ సిబ్బంది

కల్లూరు, జూలై 24: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం తయారీ కేంద్ర రేకుల షెడ్డు నిర్మాణానికి కడప జిల్లాకు చెందిన వెంకట రాజానాయుడు, విజయలక్ష్మి దంపతులు బుధవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాత దంపతులను పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో మరిందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటశిద్దులు, రాజేంద్ర, రేణుకాదేవి, ప్రకాష్, గుర్రయ్య, సైదుల్లా, మహమ్మద్ రఫీ, రాజశేఖర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డులతో కలెక్టరేట్‌కు పరుగులు



రికార్డులు సేకరిస్తున్న అధికారులు

కల్లూరు, జూలై 24: మండలంలో గత వైసీపీ పాలనలో జరిగిన భూముల లావాదేవీలకు సంబంధించిన రికార్డుల నివేదికలతో బుధవారం సంబంధిత రెవెన్యూ అధికారులు కలెక్టరేట్‌కు వెళ్లారు. పులిచెర్ల తహశీల్దార్ కార్యాలయానికి ఉదయం 6 గంటలకే రెవెన్యూ అధికారులు చేరుకుని రికార్డు సేకరణలో నిమగ్నమయ్యారు. గత ఐదేళ్లలో చేసిన ల్యాండ్ కన్వెన్షన్, 20 ఏళ్లు పైబడిన డీకేటీ భూముల రిజిస్ట్రేషన్ తదితర అంశాలకు సంబంధించిన రికార్డులను పూర్తిస్థాయిలో సేకరించారు. రికార్డుల నివేదికను ఆగమేఘాలపై రూపొందించి అధికారులు కలెక్టరేట్‌కు వెళ్లారు.

రేపు కార్గిల్ విజయోత్సవ ర్యాలీ

పలమనేరు, జూలై24 : పలమనేరు నుంచి చిత్తూరు వరకు శుక్రవారం కార్గిల్ విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాజీ సైనికోద్యోగి కె.సిద్దయ్య తెలిపారు. కార్గిల్ పోరులో విజయం సాధించిన సందర్భంగా పలమనేరు ఎన్టీఓ హోం నుంచి చిత్తూరుఆర్టీసీ డిపో వద్ద అమర జవాన్ల స్తూపం వరకు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న దేశభక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. ర్యాలీలో పాల్గొనే వారికి అల్పాహారం, మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. పాల్గొనే వారు ముందుగా 9030945855 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

వీధి కుక్కలకు సంతానోత్పత్తి నియంత్రణ ఆపరేషన్లు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు, జూలై24 : విచ్చలవిడిగా పెరిగిపోయిన వీధి కుక్కలకు వెంటనే యాంటీ ర్యాబిస్ వ్యాక్సినేషన్‌తో పాటు సంతానోత్పత్తి నియంత్రణ ఆపరేషన్లు కూడా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. వారం రోజుల క్రితం పలమనేరులో వీధికుక్కలపై ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో అధికారులు స్పందించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఈమేరకు సమావేశం నిర్వహించారు. వీధికుక్కలపై సర్వే నిర్వహించాలని, యాంటీ ర్యాబిస్ వ్యాక్సినేషన్ వేయాలని నిర్ణయించారు. ఇందుకోసం కమిటీని ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎక్స్ అఫీషియో చైర్మన్‌గా, హెల్త్ అధికారి జయశంకర్, పశు సంవర్థక శాఖ ఏడీ మోహన్ రవికుమార్, వెటర్నరీ డాక్టర్ ధనంజయ, ఏడీ డాక్టర్ శ్రీకాంత్ పలమనేరు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి నరసింహులు, కమిటీ సభ్యులుగా ఉంటారు.

దొడ్డిపల్లిలో శిక్షా సప్తాహ్



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

పలమనేరు, జూలై24 : ఈనెల 22నుంచి 29 వరకు శిక్షా సప్తాహ్ పేరుతో పాఠశాలల్లో రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం దొడ్డిపల్లి ఉన్నతపాఠశాలలో ఎంఈఓలు లీలా రాణి, బాలసుందరం నేతృత్వంలో శిక్షా సప్తాహ్ నిర్వహించారు. అన్ని తరగతుల వారికి వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఆటల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేతాజీ, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయానికి గ్రానైట్ వితరణ



దాతను అభినందిస్తున్న కమిటీ సభ్యులు

సోమల, జూలై 24: ఇరికిపెంట సమీప మధురమలై కొండలో కొలువుదీరిన మల్లేశ్వరస్వామి ఆలయం అభివృద్ధిలో భాగంగా పలువురు దాతలు విరాళాలు ప్రకటించారు. ఆలయ రెండు అంతస్తులకు గల్లా పార్థసారథి నాయుడు, రేణుకలు గ్రానైట్ అందజేశారు. వారిని కమిటీ సభ్యులు బుధవారం సన్మానించారు. చెన్నపట్నం చెరువు నుంచి రెండు కిలోమీటర్ల మేర కొండపై వరకు పలువురు దాతలు చొరవ తీసుకుని ఓం నమశ్శివాయ బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. విశాంత్ర లైన్‌మన్ జ్యోతీశ్వర నాయుడు, సుధాకర్, భాస్కర్ నాయుడు పాల్గొన్నారు

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ

సదుం, జూలై 24: చింతపర్తివారిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు, ఎన్‌ఆర్‌ఐ సుమలత విద్యా సామగ్రిని ఎంఈవో శ్రీరాములు ద్వారా అందజేశారు. ప్రతి ఏటా విద్యార్థులకు ఉచితంగా విద్యా సామగ్రిని అందజేస్తున్న సుమలతకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పశువైద్య అధికారి శ్రీకాంత్, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, మోహన్ రెడ్డి, కిశోర్ కుమార్ పాల్గొన్నారు.

మా స్థలాల్లో రియల్టర్ల ప్లాట్లు వేయడం తగదు



పట్టాలు చూపుతున్న అమినిగుంట ఎస్సీకాలని వాసులు

చౌడేపల్లె, జూలై 24: నలభై ఏళ్ల క్రితం మంజూరైన ఇందిరమ్మ కాలనీ ప్లాట్లను అక్రమించుకుని కొందరు లేఅవుట్లు వేస్తున్నారని అమినిగుంటు ఎస్సీ కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. బుధవారం వారు మాట్లాడుతూ.. 1983లో తమకు పట్టాలు ఇచ్చిన స్థలంలో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులు లేవుట్లు వేస్తున్నారన్నారు. తొలుత కొందరు వైసీపీ నాయకులు వాటిని విక్రయించగా అదిప్పుడు ఇప్పుడు ఇద్దరు ముగ్గురు రియాల్టర్ల చేతులు మారిందన్నారు. ఇప్పుడు కొన్న వ్యక్తులు తాజాగా ప్లాట్లు వేస్తున్నారన్నారు. తమకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను కోరామన్నారు. వీఆర్‌వో మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ..పెద్దకొండామారి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 770/1లో 7.05 సెంట్ల భూమి సెటిల్‌మెంట్ ల్యాండ్ అన్నారు. సర్వేనంబరు 744/2లో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలిచ్చినట్లు తెలిపారు. అమినిగుంట గ్రామస్థులు పట్టాలు తీసుకువస్తే పరిశీలిస్తామన్నారు. 770/1లో పట్టాలున్నట్లు తెలితే చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఈనెల 28,29 తేదీల్లో
ఆడికృత్తిక మహోత్సవాలు

చౌడేపల్లె, జూలై24: స్థానిక బజారు వీధిలో అభీష్ట మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో వళ్లీదేవసేన సమేత శ్రీషణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామికి ఈనెల 28,29న ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు రాజశేఖర్ దీక్షితులు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..ఈనెల 28న స్వామివారికి భరిణి కావిళ్లు, 29న కృత్తిక కావిళ్లు, భక్తులు చెల్లించనున్నట్లు తెలిపారు. స్వామివారిని కల్యాణోత్సవం తర్వాత నెమలి వాహనంపై ఊరేగిస్తామన్నారు. భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

చౌడేపల్లె, జూలై24: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక బోయకొండ ఆర్చి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన ద్విచక్ర వాహనదారులు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని, డ్రంక్‌అండ్ డ్రైవ్‌గా తేలితే జరిమానాలతో పాటు జైలుశిక్ష కూడా ఉంటుందని అవగాహన కల్పించారు.

మంత్రి నాదెండ్లను కలసిన వాల్మీకి సంఘనేత



పుంగనూరు రూరల్, జూలై24: పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌లను రాష్ట్ర వాల్మీకి సంఘ నేత, విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్ బాబు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన మంత్రిని దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. పల్లా శ్రీనివాస్‌లను కలిశారు. పుంగనూరు నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు గురించి, చిరకాలంగా పెండింగ్‌లో ఉన్న వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు జనసేన నేత చిన్నా రాయల్, ధర్మేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి ఆర్టీసీ కార్మికుల సమస్యలు



టీడీపీ నాయకులను సన్మానిస్తున్న ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

పుంగనూరు రూరల్, జూలై24: ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామని మండల టీడీపీ నేతలు మాధవరెడ్డి, సీవీరెడ్డిలు అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యుల సర్వసభ్య సమావేశంలో టీడీపీ నాయకులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు తమ సమస్యలను వివరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జీవీ. రమణ, జెఆర్ఎన్‌రెడ్డి, గంగాధర్, నారాయణరెడ్డి, రమేశ్, రెడ్డెప్ప మధుసూధన్‌రెడ్డి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం



విద్యుత్ అలంకరణలో స్వామి వారి ఆలయం

సోమల, జూలై 24: కరకమంద చెన్నమల్లయ్య తాత ఆలయ వార్షిక బ్రహ్మోత్సవం సందర్భంగా బుధవారం కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేదపండితులు సుబ్రమణ్యం శర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, స్వస్తివాచనం, కలిశస్థాపన, దీక్షాహోమం, గణపతి హోమం, అష్టోత్త శత దీపాలంకరణ, తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురువారం అభిషేకాలు, అర్చన, నవగ్రహ ఆరాధన, మూల మంత్ర జపాలు, హోమాది కార్యక్రమాలు జరుగనున్నాయి. పూజా కార్యక్రమాల్లో నంపల్లె, సోమల, కరకమంద, సూరయ్యగారిపల్లె తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



సోమల, జూలై 24: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నంజంపేట హైస్కూల్‌లో వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. సోమల, కందూరు, పెద్దఉప్పరపల్లె, అడుసుపల్లె, ఇరికిపెంటల్లో పాఠశాల్లో శిక్షాసప్తాహ్ కార్యక్రమాలను అధికారులు పరిశీలించారు. బోధనాభ్యాసన సామగ్రిని తయారీ విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో శివరత్న, హెచ్‌ఎంలు హరినాథ్, ఎల్లయ్య, శోభారాణి, జగన్‌మోహన్ రెడ్డి, మోహన్‌రెడ్డి, వసంతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పైపాళ్యం దత్తత తీసుకుంటా : భువనేశ్వరి





పైపాళ్యంలో మహిళలతో భువనేశ్వరి ముఖాముఖి - ఏనుగుల దాడి బాధితునికి చెక్కు పంపిణీ

కుప్పం, జూలై 24: అధికారాలు, ఆడంబరాలు శాశ్వతం కాదు..చివరకు మిగేలేది మీ ఆదరాభిమానాలే... ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి అన్న మాటలివి. బుధవారం ఎన్.కొత్తపల్లె, నడిమూరు, పైపాళ్యం, ఉర్లవోబనపల్లె, గుడ్లనాయనిపల్లె గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఆయా గ్రామ మహిళలతో సమావేశమయ్యారు. మండలంలోనే అత్యధిక మెజారిటీ అందించిన పైపాళ్యం పంచాయతీని దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఇక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు, యువత ఉపాధికి, మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. వైసీపీ అరాచక పాలనలో సంక్షేమాన్ని, అభివృద్ధిని గాలికి వదిలేసి దొరికిందల్లా దోచుకుని తిన్నారని ఆమె విమర్శించారు. వాటన్నింటినీ సరిదిద్ది మేలు చేయడానికి చంద్రబాబుకు కొంత సమయం పడుతుందన్నారు. నియోకవర్గానికి ప్రకటించిన ప్రత్యేక మ్యానిఫెస్టో కార్యాచరణకు ప్రణాళిక రూపొందించారన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ రోడ్లు, కాలువలు, తాగునీరు ఇవ్వడానికి చంద్రబాబు, లోకేశ్‌లు కృషి చేస్తున్నారని చెప్పారు. కుప్పం అభివృద్ధికి ప్రత్యేకంగా చంద్రబాబు ఒక అధికారిని నియమించారన్నారు.

వినతులపై వెనువెంటనే స్పందన

కొందరు మహిళలు ఆమెకు పలు సమస్యలను నివేదించారు. నడిమూరులో కళావతి అనే మహిళ మాట్లాడుతూ భూములు రాత్రికిరాత్రి ఆన్‌లైన్లో మారిపోతున్నాయని, పూర్వ స్థితికి తేవడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, భూములను సక్రమంగా కాపాడుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. భువనేశ్వరి స్పందిస్తూ ఫిర్యాదులను సీఎంకు నివేదించి చర్యలు తీసుకుంటామన్నారు. నడిమూరు గొల్లపల్లెలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఎన్.కొత్తపల్లె సర్పంచి రాజశేఖర్ వినతిపై భువనేశ్వరి స్పందించి హామీ ఇచ్చారు. ఎన్.కొత్తపల్లెలో కురబ సంఘం తరపున ఆమెకు గొర్రెపిల్లను బహూకరించారు. ఏనుగు దాడి బాధితుడు కరిసిద్ధప్పకు అటవీ శాఖ తరపున రూ.88,745 చెక్కును అందించారు. పైపాళ్యంలో అమరావతి నిర్మాణానికి టీడీపీ నాయకుడు విజయకుమార్, సీకే.మణి తదితరులు రూ.50 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నాయకులు పీఎస్.మునిరత్నం, డాక్టర్ సురేశ్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, వీజీ.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా ఘన స్వాగతం

భువనేశ్వరికి గ్రామగ్రామానా ప్రజలనుంచి ఘన నీరాజనం లభించింది. ఎన్.కొత్తపల్లెలో మంగళవాయిద్యాలు,పూర్ణకుంభాలతో, నెమలి డ్యాన్సులతో స్వాగతం పలికారు. కత్తిమానుపల్లెలో ఆమె టీడీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. చందం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. జిల్లాలో అతిథి అధ్యాపకులు భువనేశ్వరిని కలిశారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని వారికి ఆమె హామీ ఇచ్చారు.

కంటి సమస్య బాధితులను గుర్తించండి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

కుప్పం, జూలై 24: ఈనెల 19నుంచి ప్రారంభం కానున్న ఇంటింటి సర్వేలో కంటి సమస్యలున్న వారిని గుర్తించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మండల సచివాలయంలో బుధవారం ఆయన కంటి వెలుగు, ఫీవర్ సర్వేల పురోగతిపై నియోకవర్గ పరిధిలోని మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటి సమస్యలున్నవారిని గుర్తించే ప్రక్రియ వారం రోజుల్లో పూర్తి కావాలన్నారు. ప్రిలిమినరీ స్క్రీనింగ్ నిర్వహించి అవసరాన్ని బట్టి ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తామన్నారు. మూడు నెలల్లోగా గర్భిణుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. సుఖ ప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కడా పీడీ వికాస్ మర్మత్, కుప్పం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ విజయకుమారి, మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం



ఆటల పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పుంగనూరు రూరల్, జూలై 24: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి పేర్కొన్నారు. బుధవారం చంద్రమాకుల పల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 29తేదీ వరకు విద్యా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పీడీ మురళీధర్, ఉపాధ్యాయులు జ్యోతి, వెంకటరమణరెడ్డి, మంజునాథ్, రఘు, శైలజ, పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బైరెడ్డిపల్లె, జూలై 24 : కడపనత్తం జడ్పీఉన్నత పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు బుధవారం కల్యాణ్ ఫౌండేషన్ చైర్మన్ పవన్‌కల్యాణ్ సహకారంతో బైరెడ్డిపల్లె ఎస్ఐ కృష్ణయ్య ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కల్యాణ్ ఫౌండేషన్ చైర్మన్ పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పారామెడికల్ ఆఫీసర్ దయానందం

బైరెడ్డిపల్లె, జూలై 24: జడ్పీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ దయానందం కుష్ఠువ్యాధిపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మైక్రో బ్యాక్టీరియా లెప్రే అనే బ్యాక్టీరియా ద్వారా గాలి ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. స్పర్శలేని మచ్చలు, దళసరి రంగుగా మారిన చర్మం, మచ్చలు ఉంటే వైద్యాధికారిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, పాఠశాల హెచ్‌ఎం గౌహర్‌సుల్తానా, ఆశాకార్యకర్తలు ముబీనా, భారతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమణకు గురైన దారి సమస్య పరిష్కరించండి



డిప్యూటి తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్నగ్రామస్థులు

గంగవరం, జూలై 24: దశాబ్దాలుగా ఉన్న దారిని ఉన్నపలంగా మూసేసి తమపై దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మారేడుపల్లె గ్రామస్థులు బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతిరోజూ తాము చాలాకాలంగా తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, పాఠశాలలు, కౌండిన్య నదీవాగుకు దశాబ్దాలుగా ఈ దారిని ఉపయోగించుకుంటున్నామన్నారు. దీనిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రాత్రికి రాత్రే అక్రమించేసి రాతి స్తంబాలు పాతి మూసివేశాడన్నారు. ప్రశ్నిస్తే ఎదురుతిరిగి దుర్భాషలాడుతున్నాడన్నారు. అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటి తహసీల్దారు సహనకు వినతిపత్రం అందించారు.

సభాపతి అయ్యన్నపాత్రునికి ధన్యవాదాలు

గంగవరం, జూలై 24: శాసన సభలో కార్యకలాపాలు తెలుగులో నిర్వహించాలని సభాపతి అయ్యన్నపాత్రుడు నిర్ణయించడం పట్ల తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు బుధవారం ఓ ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో గ్రామ సచివాలయాలు, మండల కార్యాలయాలు, జిల్లా కార్యాలయాల్లో తెలుగులో కార్యకలాపాలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఇంట్లో సహాయకురాలు చోరీ చేసిందని ఫిర్యాదు

పుంగనూరు రూరల్, జూలై24: ఇంటిలో సహాయకురాలు బంగారం దొంగిలించిందని యజమాని ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపిన వివరాలిలా.... పట్టణంలోని ఆంజనేయస్వామిగుడి వీధిలోని షేక్ సయ్యద్ వ్యాపారం చేస్తుంటారు. భార్య అనారోగ్యం కారణంగా సహాయకురాలిగా మేరీసునీతను పెట్టుకున్నారు. బుధవారం సయ్యద్‌బాషా బయటకు వెళ్లారు. అదే సమయంలో మేరీసునీత తన ఇంటిలోని 108 గ్రాముల బంగారు నగలు, సెల్‌ఫోన్ తీసుకెళ్లినట్లు బాషా ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎట్టకేలకు నెల్లితిప్ప రోడ్డుకు మోక్షం



భూమిపూజ చేస్తున్న రంగనాథ్, నేతలు

వి.కోట, జూలై 24: ముదరందొడ్డి పంచాయతీ నెల్లితిప్పలో ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభించారు. 2018లో నాటి టీడీపీ హయంలో ఈపీఏ గ్రాంట్ ద్వారా రోడ్డు పనులను వైసీపీ హయంలో ప్రారంభించినా అర్థాంతరంగా ఆపేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులను పునఃప్రారంభించారు. బుధవారం మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్ నేతృత్వంలో స్థానిక నేతలు నెల్లితిప్పకు చేరుకుని భూమిపూజ చేసి పనులకుప్రారంభించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, నేతలు హరినాథరెడ్డి, సుధాకర్‌రెడ్డి, దామోదర్, సుబ్రమణ్యంశెట్టి, భాస్కర్, రామప్పశెట్టి, చంద్రశేఖర్, బాలు, సుబ్రమణ్యంగౌడు, బాబు తదితరులు ఉన్నారు.

సంకటహర చతుర్థి వేడుకలు



కల్లూరు, జూలై 24: దేవళంపేటలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వైభవోపేతంగా సంకటహర చతుర్థి వేడుకలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం గణనాధునికి కుంకుమాభిషేకం, గంధమాభిషేకం, క్షీరాభిషేకం కర్పూరహారతి నిర్వహించారు. భక్తులకు అర్చకులు ఫణిప్రకాష్‌శర్మ ప్రసాదాలు అందజేశారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

వి.కోట, జూలై 24: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలోని వాడల్లో ముమ్మరంగా పారిశుధ్యం పనులు చేపట్టారు. ఇటీవల జ్వరాలు ప్రబలుతుండటంతో సర్పంచ్ పీ.ఎస్.లక్ష్మీ ఆదేశాలతో ఈవో యదవపతి నేతృత్వంలో మూడు రోజులుగా అన్ని వాడల్లో మురుగు కాల్వలను శుభ్రం చేస్తున్నారు. మూసుకుపోయిన కాల్వలను సరిదిద్దుతున్నారు. ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఆక్రమణలను తొలగించి మురుగు ప్రవహించేలా చర్యలు చేపట్టారు.

నేడు రామకుప్పంలో భువనేశ్వరి పర్యటన

రామకుప్పం, జూలై 24: సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి గురువారం రామకుప్పం మండలంలో పర్యటించనున్నారు. ఇందుకు టీడీపీ శ్రేణులు ఏర్పాట్లు చేశాయి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆమె మండలంలో పర్యటించనున్నారు. ఆవులకుప్పం, నారాయణపురంతాండా, ఆరిమానిపెంట, వీర్నమల గ్రామాల్లో మహిళలతో ముఖాముఖి నిర్వహిస్తారు. రామకుప్పం పట్టణంతో పాటు అన్ని గ్రామాల్లో స్వాగతం పలుకుతూ నేతలు కార్యకర్తలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నాలుగు గ్రామాల్లో నిర్వహించే సమావేశాలకు పెద్దఎత్తున మహిళలు, ప్రజలు హాజరయ్యేలా నేతలు, కార్యకర్తలు కృషి చేస్తున్నారు.

దారి సమస్యపై పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, జూలై 24: దారి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని కురప్పల్లె, అమ్మిగానిపల్లె, గోపిశెట్టిపల్లె రైతులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం శ్రీకాళహస్తికి చెందిన పైపుల ఫ్యాక్టరీకి ఆరడి గుంట భూములను కేటాయించిందన్నారు. సర్వే నెంబరు 267, 266, 264లో పంటల తరలింపునకు తాము వాడుతున్న బండిబాట రెవెన్యూ లెక్కల్లో ఉందని స్పష్టం చేశారు. ఫ్యాక్టరీ యజమాన్యం బండిబాటకు కంచె ఏర్పాటు చేయడంతో తాము ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. పంట ఉత్పత్తులు తరలించేందుకు ప్రత్యామ్నాయం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, జూలై 24: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందే ఫిర్యాదులు, డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో అందే వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. గురువారం నగరపాలక కార్యాలయంలో అధికారులతో ఆమె సమీక్షించారు. వార్డు కార్యదర్శులు, సంబంధిత అధికారులు అర్జీదారులతో మాట్లాడి ఫిర్యాదులను 24 గంటల్లో పరిష్కరించాలన్నారు. పరిష్కరించకపోతే అందుకుగల కారణాలను అర్జీదారుడికి చెప్పాలన్నారు. సమావేశంలో ఏసీ రామకృష్ణుడు, ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, ఎంఈ గోమతి పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో డీఎంహెచ్‌వో తనిఖీలు



చిత్తూరు రూరల్, జూలై 24: నగరంలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ ఉన్నవారు మాత్రమే ప్రాక్టీస్ చేయాలని, లేకుంటే ఆస్పత్రిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్స్, ఆస్పత్రులు నిర్వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఈ రోడ్డుకు మోక్షం కలిగేనా?



నగరి జూలై24: మండల పరిధిలోని కన్నికాపురం రోడ్డు ఐదేళ్లుగా కంకరకే పరిమితమైంది. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ హయాంలో రోడ్డు పనులకు నిధులు మంజూరు కాగా కంకర తోలారు. ప్రభుత్వం మారడంతో నాగరాజుకుప్పం నుంచి కన్నికాపురం వరకు కంకర అలాగే ఉంది. రోడ్డు పనులు జరగలేదు. ఆ మార్గంలో వెళ్లాలంటే ద్విచక్ర వాహన దారులు నానా తంటాలు పడుతున్నారు. కొత్త ప్రభుత్వమైనా దీనిపై దృష్టి సారించా లని ప్రజలు కోరుతున్నారు.

బలోపేతం దిశగా పీఆర్‌టీయూ


విజయలక్ష్మి

చిత్తూరు (సెంట్రల్), జూలై 24: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ బలోపేతం దిశగా అడుగులు వేస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్ తెలిపారు. పలువురికి సంఘంలో స్థానంతో పాటు సభ్యత్వ నమోదు వేగవంతం చేయనున్నట్లు చెప్పారు. గిరింపేట మున్సిపల్ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న ఆర్.విజయలక్ష్మిని నగర గౌరవాధ్యక్షురాలిగా నియమించగా, ఇదే పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఏకాంబరంను నగర అధ్యక్షుడిగా, ప్రశాంత్ నగర్ ఎంసీపీఎస్‌లో ఎస్జీటీ గా పనిచేస్తున్న ప్రతాప్ కుమార్‌ను ప్రధాన కార్యదర్శిగా, ఇదే పాఠశాలలో ఎస్ఏగా పనిచేస్తున్న సి.వెంకటేశ్వర్లు ను రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా నియమిం చినట్లు తెలిపారు.

IN THE COURT OF IV ADDITIONAL DISTRICT JUDGE:: TIRUPATI
I.A.No.14 OF 2023
I.A.No. 13 OF 2023
O.S.No. 122 OF 2012

Between
1.K.Kavitha Lakshmi
2.D.Krishna Keerthan
...Petitioners/ Plaintiffs
And
1.D.Rama Rao and Others
...Respondents/ Defendants

Notice to the Respondent No.5

To
Respondent No.5
Dusi Santhi D/o. Dusi Rama Rao W/o. K.Hari Krishna C/o. K.Chengaiah Sharma, Hindu aged 41 years, Residing at Near State Bank of India, Nagari Chittoor District

WHEREAS the above case filed by the plaintiff for partition of plaint schedule property against you and others and also I.A.No.13 of 2023, I.A.No.14 of 2023 filed for major declaration and division of property against you and other and that you are hereby summoned of notice to appear before the above Hon'ble Court in person or by a Pleader on **29th of July, 2024** at 10:30 O' Clock. TAKE notice of the suit summons and I.A. Notice, in defaults of your appearance on above date the suit and I.A. will be heard and determined in your absence.

C.Vijay Kumar, A. Rajasekhar
Advocates, Tirupati

రేపు పొన్నియమ్మ ఆలయంలో కైలాసగిరి వ్రతం

చిత్తూరు కల్చరల్, జూలై 24: స్థానిక పొన్నియమ్మ ఆలయంలో ఈనెల 26వ తేదీన కైలాసగిరి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, హోమం నిర్వహించి భక్తులతో వ్రతం ఆచరించనున్నట్లు పేర్కొన్నారు. నగరవాసులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

జగన్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత లేదు : టీడీపీ

చిత్తూరు సిటీ, జూలై 24: మాజీ సీఎం జగన్‌కు ప్రజాస్వామ్యంపై మాట్లాడే హక్కులేదని మాజీ మేయర్ కఠారి హేమలత బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం కొనసాగుతోందని పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. అక్రమ కేసులు పెట్టి వేలాదిమందిని జైలుకు పంపారని ఆరోపించారు. అన్ని వ్యవస్థలను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. వ్యవస్థలు గాడిన పడుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందని గవర్నర్‌ను కలవడం జగన్ దివాలాకోరుతనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు మంజూరు వెనుక సీఎం చంద్రబాబు కృషి ఎంతో ఉందని తెలిపారు.

నేడు 'డయల్ యువర్ ఎమ్మెల్యే' రద్దు

చిత్తూరు, జూలై 24: నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం జరగాల్సిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొంటున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని వచ్చే వారానికి వాయిదా వేసినట్లు వివరించారు.

వైభవంగా చతుర్దశి పూజలు


సత్యసాయి సంస్థాన్‌లో పూజలు చేస్తున్న భక్తులు

చిత్తూరు కల్చరల్, జూలై 24: గిరింపేట సత్యసాయిసంస్థాన్‌లో బుధవారం గణేశుడికి సంకటహర చతుర్దశి పూజలు వైభవంగా నిర్వహించారు. అభిషేకం, పూజల అనంతరం విశేష అలంకారం చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. దొడ్డిపల్లె వినాయకాలయంలో గణనాథుడికి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేపు కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ

గంగాధరనెల్లూరు, జూలై 24: కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించేందుకు శుక్రవారం నిర్వహించనున్న కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీని విజయవంతం చేయాలని సైనిక సంక్షేమ సంఘ మండల మాజీ అధ్యక్షుడు హరికృష్ణారెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని అమర జవాన్ స్థూపం వద్ద ఉదయం 10గంటలకు కార్గిల్ వీరులకు నివాళులు అర్పించి, ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

స్వచ్ఛమైన నీరు తాగాలి


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాలసముద్రం, జూలై 24: స్వచ్ఛమైన నీటిని తాగి, వ్యాధులకు దూరంగా ఉండాలని ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది కోరారు. ఈ మేరకు బుధవారం పాలసముద్రంలో మన నీరు-మన పాలసముద్రం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వర్షాకాలం నీరు కలుషితమయ్యే ప్రమాదముందని, తద్వారా డయేరియా వంటి వ్యాధులు సోకుతాయని తెలిపారు. ఏఎన్ఎంలు లక్ష్మి, గంగ పాల్గొన్నారు.

భువనేశ్వరికి సన్మానం


భువనేశ్వరిని సన్మానిస్తున్న తెలుగు మహిళలు

నగరి, జూలై 24: సీఎం నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరిని పార్టీ నగరి నేత రామానుజం చలపతి ఆధ్వర్యంలో తెలుగు మహిళలు సన్మానించారు. కుప్పం పర్యటనలో ఉన్న ఆమెను బుధవారం నగరి మాజీ కౌన్సిలర్ లత, తెలుగు మహిళలు కలిసి పసుపు, కుంకుమ, పూలు, గాజులు సారెగా అందించారు. కార్యక్రమంలో అలిమేలు, హేమ అంజేరమ్మ, ఆదెమ్మ, పుష్ప, ధనమ్మ పాల్గొన్నారు.

జగన్ డ్రామాలను ప్రజలు నమ్మరు : ఎంపీ

చిత్తూరు సిటీ, జూలై 24: మాజీ సీఎం జగన్ డ్రామాలను ప్రజలు నమ్మరని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీలో శాంతి భద్రతలు నశించాయంటూ ఢిల్లీలో ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఆయనకు రాజ్యాంగం అన్నా.. ప్రజాస్వామ్యమన్నా విలువలేదని పేర్కొన్నారు. జగన్ నియంతృత్వ పోకడ వల్ల రాష్ట్ర ప్రజలు గత ప్రభుత్వంలో ఎన్నో కష్టాలుపడ్డారని విమర్శించారు. డాక్టర్ సుధాకర్ విషాదకర రీతిలో మృతిచెందినపుడు, డ్రైవర్ సుబ్రమణ్యంను చంపి డోర్ డెలివరీ చేసినపుడు జగన్ రెడ్డి ఎక్కడున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఊచకోతకు గురైనపుడు జగన్ ఎందుకు స్పందించలేదని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్ర అభివృద్ధికోసం ప్రణాళికలు రూపొందించి ముందుకుపోతుంటే విమర్శలు చేయడం దారుణమని పేర్కొన్నారు.

ప్రభుత్వం వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలి

నింద్ర, జూలై 24: రైతులు దళారుల బారినపడకుండా ప్రభుత్వమే వరిధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను కోరినట్లు తెలుగు రైతు మాజీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రవినాయుడు తెలిపారు. నింద్రలో ఆయన మాట్లాడుతూ రైతు కష్టం దళారుల పాలు కాకుండా చూడాలని, ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసువెళ్లాలని కోరినట్లు చెప్పారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సులు


బస్సు ఆగిపోవడంతో అయోమయంలో విద్యార్థులు

పాలసముద్రం, జూలై 24: చిత్తూరు - బలిజకండ్రిగ మార్గంలో నడిచే చిత్తూరు-2 డిపో బస్సులు తరచూ మొరాయిస్తున్నాయి. కండిషన్ లేని ఈ బస్సులు ఎక్కడపడితే అక్కడ ఆగిపోతుండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. విద్యార్థులు, ఉద్యోగులు కళాశాలలకు, కార్యాలయాలకు సకాలంలో చేరలేకపోతున్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు చిత్తూరు డిపో నుంచి బయలుదేరిన బస్సు వెంగళరాజుకుప్పం వద్ద ఆగిపోయింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా అది కదల్లేదు. ఈ క్రమంలో కొంతమంది ఆటోల్లో గమ్యం స్థానం చేరుకోగా, మరికొందరు మళ్లీ బస్సు వచ్చే వరకు వేచి ఉండాల్సి వచ్చింది. కండిషన్ బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు సమర్పించినా లాభం లేకపోతోందని, ఇప్పటికైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి


విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

బంగారుపాళ్యం, జూలై 24: విద్యార్థులు చదువులో రాణించాలని జీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఈశ్వర్ నాయుడు, ఎన్ఆర్ఐ కళ్యాణ్ కోరారు. మండలంలోని తుంబకుప్పం, తుంబపాళ్యం, ఈచనేరిపల్లి, నల్లంగాడు, ఎర్రాండ్లపల్లి, ముంగరమడుగు గ్రామాల్లోని పాఠశాల విద్యార్థులకు బుధవారం ఈశ్వర్ కళ్యాణ్ అభయం ట్రస్టు ఆధ్వర్యంలో విద్యాసామగ్రి అందజేశారు. టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ సురేంద్రనాయుడు మాట్లాడుతూ దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీడీపీ నేతలు కోదండయాదవ్, రమేష్, మోహన్ నాయుడు, మాధవ నాయుడు, శివ, రాజేంద్రనాయుడు, తిలక్ యాదవ్, గురుస్వామి, ఆరీఫ్, ఉపాధ్యాయులు గురునాథం, రఘు పాల్గొన్నారు.

108లో ప్రసవం



గంగాధరనెల్లూరు, జూలై 24: మండలంలోని మహాదేవమంగళం గ్రామానికి చెందిన హరిత 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. ఆమెకు బుధవారం ఉదయం నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మధ్యలోనే నొప్పులు తీవ్రతరం కావడంతో అంబులెన్స్‌ను పక్కన నిలబెట్టి ఈఎంటీ ప్రశాంత్, పైలట్ మురగయ్య ఆధ్వర్యంలో హరితకు సహాయకురాలిగా వచ్చిన మహిళ సాయంతో సుఖ ప్రసవం చేయించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

విద్యార్థినులకు విద్యా సామగ్రి పంపిణీ



గంగాధరనెల్లూరు, జూలై 24 : గంగాధరనెల్లూరు హైస్కూల్లో 1982-83 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులు ప్రభాకర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, మధుసూదన్, రోశయ్యనాయుడు, జయచంద్రనాయుడు, వాసు, చంద్రన్‌లు హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు బుధవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. పేద విద్యార్థినులకు తమవంతు తోడ్పాటు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులను టీచర్ల బృందం సన్మానించింది. ఇన్‌చార్జి హెచ్ఎం దినకరన్, టీచర్లు శ్రీధర్, శ్యామల పాల్గొన్నారు.

117 జీవోను రద్దు చేయాలి : ఎస్టీయూ


సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎస్టీయూ నేతలు

వెదురుకుప్పం, జూలై 24: 117 జీవోను రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్ మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వెదురుకుప్పంలో ఉపాధ్యాయుల సమస్యల సేకరణ, ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. మండల పరిధిలోని పలు జడ్పీ ఉన్నత పాఠశాలలకు వెళ్లారు. ఆయన మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష మీడియం రెండింటినీ నిర్వహించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే నిర్వహించి, ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 12వ పీఆర్‌సీకి సంబంధించి 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ రుణాలను మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర నాయకుడు హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ తల్లికి వందనం కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల తల్లులకే వర్తింపజేయాలని తెలిపారు. పాఠశాలలకు నిర్వహణ గ్రాంటు మంజూరు చేయాలని, విద్యుత్ చార్జీలను ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. మండలాధ్యక్షుడు సుభాష్, ప్రధాన కార్యదర్శి న్యాంతుల్లా వారి వెంట ఉన్నారు.

వ్యాను ఢీకొని వృద్ధుడి మృతి


మృతిచెందిన గోవిందరెడ్డి

బంగారుపాళ్యం, జూలై 24: చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలోని గోమతి స్పిన్నర్స్ ఫ్యాక్టరీ సమీపంలో బుధవారం వ్యాను ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు మండలం బొమ్మిదొడ్డికి చెందిన గోవింద రెడ్డి (69) బంగారుపాళ్యం మండలం కల్లూరుపల్లిలోని తన కుమార్తెను చూసేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. గోమతి స్పిన్నర్స్ ఫ్యాక్టరీ సమీపంలో ఎదురుగా వస్తున్న వ్యాను ఢీకొంది. తీవ్రంగా గాయపడడంతో బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గోవింద రెడ్డి మృతిచెందాడు. బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సుధాకర్ రాజు మృతదేహం అప్పగింత

బంగారుపాళ్యం, జూలై 24: బంగారుపాళ్యం మండలం మహాసముద్రం టోల్‌ప్లాజా వద్ద మంగళవారం వేకువజామున హత్యకు గురైన బస్సు డ్రైవర్ సుధాకర్ రాజు మృతదేహానికి చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి, బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇద్దరు ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ల మధ్య చెలరేగిన మాటల యుద్ధం హత్యకు దారితీసిన విషయం విదితమే. గుంటూరు జిల్లా పొన్నూరు గ్రామానికి చెందిన సుధాకర్ రాజు అన్న స్వరాజ్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు శ్రీకృష్ణ ట్రావెల్స్ డ్రైవర్ శ్రీనివాసరావుపై హత్యకేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మయ్య తెలిపారు.

కటౌట్ కడుతూ కిందపడి తమిళనాడు యువకుడి మృతి


మృతిచెందిన అరుణచాలం

శ్రీరంగరాజపురం, జూలై 24: కటౌట్ కడుతూ జారిపడి తమిళనాడు రాష్ట్రానికి చెందిన యువకుడు మృతిచెందిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఎస్ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లెమిట్ట లో వైసీపీ చిత్తూరు ఇన్‌చార్జి విజయానందరెడ్డి జన్మదిన వేడుకలకు సంబంధించిన ఫ్లెక్సీలను కట్టేందుకు తమిళనాడు రాష్ట్రం రాణిపేటకు చెందిన పది మంది యువకులు వచ్చారు. పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై చర్చి పక్కన కటౌట్ ఏర్పాటు చేస్తుండగా వేలూరు జిల్లా సత్యమంగళం గ్రామానికి చెందిన అరుణచాలం(35) అలియాస్ అరుణ్ జారి కిందపడ్డాడు. స్థానికులు అతన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ కుళాయిప్ప తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయానికి భద్రత కల్పించండి

గుడిపాల, జూలై 24: గుడిపాల తహసీల్దార్ కార్యాలయానికి భద్రత కల్పించాలని మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు కోరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కబ్జా చేయడమే కాకుండా ఫైళ్లు కాల్చివేశారని, మండలంలోనూ వందల ఎకరాల భూములను వైసీపీ నాయకులు కబ్జా చేశారని, ఆ రికార్డులను కాల్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ముందు జాగ్రత్తగా భద్రత ఏర్పాటు చేస్తే కబ్జాదారులు తప్పించుకునే ప్రమాదం లేకుండా ఉంటుందని అన్నారు.

నేడు ఎన్‌పీఎస్‌లో గణిత పజ్ఞాదారణ

చిత్తూరు (సెంట్రల్), జూలై 24: ఏపీ మ్యాథ్స్ ఫోరం, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎన్ సావిత్రమ్మ డిగ్రీ కళాశాలలో గణిత ప్రజ్ఞాదారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గణిత అవధాని హెచ్.అరుణ శివప్రసాద్ తెలిపారు. విద్యార్థినులు లహరి, హేమ, పునీత్, రేవతి అవధానంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

28నుంచి అంబేడ్కర్ ఓయూ డిగ్రీ తరగతులు

చిత్తూరు (సెంట్రల్), జూలై 24: ఈ నెల 28 నుంచి స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓయూ 2023-24 అకడమిక్ ఇయర్ 2వ సెమిస్టర్ తరగతులు ప్రారంభించనున్నట్లు సెంటర్ కోఆర్డినేటర్ మీరాసాహెబ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా తరగతులకు హాజరుకావాలని, ఇతర వివరాలకు 7382929664లో సంప్రదించాలని కోరారు.

నిధుల కేటాయింపుపై హర్షం

గుడిపాల, జూలై 24: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించడంపై టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో 25మంది ఎంపీలున్నా కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేకపోవడం దౌర్భాగ్యమన్నారు. అప్పుడే నిధులను రాబట్టివుంటే రాష్ట్రం పురోగతి సాధించేదన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు ధనుంజయ నాయుడు, టీడీపీ నాయకులు నాగరాజ్ యాదవ్, చంద్రమోహన్, గుర్రప్ప నాయుడు, రవి నాయుడు, పళని, జయచంద్ర, శివలింగా రెడ్డి, గోపి, ఐజాక్, జయరామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్నారు..



గుడిపాల, జూలై 24: చిత్తూరు ఎమ్మెల్యేగా గురజాల జగన్మోహన్ గెలుపొందడంతో టీడీపీ మండల నేతలు బుధవారం తమిళనాడు రాష్ట్రం వేలాంగని చర్చిలో మొక్కులు తీర్చుకున్నారు. నాయకులు గాంధి, మనోజ్ తదితరులు ఉన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు



కార్వేటినగరం, జూలై 24: కార్వేటినగరంలో బుధవారం జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి పొన్నా యుగంధర్ ఆధ్వర్యంలో చేపట్టారు. గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయటానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నాయకులు శోభన్ బాబు, వెంకటేష్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి

కార్వేటినగరం, జూలై 24: సంప్రదాయ క్రీడలను యోగాతో అనుసంధానం చేసి, ప్రోత్సహించాలని డీఎంపురం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కేశవులు సూచించారు. సంప్రదాయ క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. క్రీడా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఆర్కేవీబీ పేట జడ్పీ హైస్కూల్లో బుధవారం ఇన్‌చార్జి హెచ్ఎం అరుణ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించారు.

పశువులకు ఉచిత వైద్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ గీతారెడ్డి

పెనుమూరు, జూలై 24: స్థానిక ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో బుధవారం పశువులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. మందులు పంపిణీ చేశారు. ఏడీ గీతారెడ్డి, వెటర్నరీ డాక్టర్ చిరంజీవి హాజరై దాదాపు 30 పశువులకు వివిధ వ్యాధులకు సంబంధించి వైద్యం చేశారు. పాడి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రూ.17వేలు విలువ చేసే మందులు పంపిణీ చేసినట్లు పెనుమూరు వెటర్నరీ డాక్టర్ పార్థిబన్ తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌పై హర్షం



శ్రీరంగరాజపురం, జూలై 24: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాభివృద్ధికి నిధులు కేటాయించడం హర్షణీయమని టీడీపీ మాజీ జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు బోడపాటి లోకనాథం నాయుడు పేర్కొన్నారు. బుధవారం పుల్లూరులో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పురోగతికి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మండలాధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, బాలాజీ నాయుడు, నిరంజన్‌రెడ్డి, హేమాద్రి యాదవ్ పాల్గొన్నారు.

శిక్షా సప్తాహ్ లోగో ఆవిష్కరణ



వెదురుకుప్పం, జూలై 24: వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం శిక్షా సప్తాహ్ వారోత్సవాలను పురస్కరించుకుని నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 లోగోను విద్యార్థులతో ఆవిష్కరించామని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రమేష్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. విద్యా వికాసానికి ఈ వారోత్సవాలు తోడ్పాటునిస్తాయని పేర్కొన్నారు.